క్లుప్తంగా

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న లక్ష్మీనారాయణ, లక్ష్మి దంపతులు

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా చేపట్టిన కల్యాణ మండపం నిర్మాణానికి కోదాడకు చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు చిలక లక్ష్మీనారాయణ, లక్ష్మి దంపతులు ఒక లక్ష వెయ్యి రూపాయలను విరాళంగా గురువారం నడిగూడెంలో ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బి.వెంకటరత్నం, కొండా వెంకన్న, చెన్నూరు బాబు, అప్పారావు, ఉపేందర్, చిలక నవీన్ కుమార్, విశ్వ సౌజన్య పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



కోటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పందిరి నాగిరెడ్డి, తదితరులు

మునగాల : మండలంలోని ఆకుపాములకు చెందిన పచ్చిపాల కోటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఆకుపాములలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ కోదాడ నియోజకవర్గ నాయకుడు, పందిరి ఫౌండేషన్ చైర్మన్ పందిరి నాగిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి పందిరి ఫౌండేషన్ తరఫున రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ సలహాదారుడు ఎస్.ఎస్.రావు, సెక్రటరీ ఇమ్మడి సతీష్ బాబు, సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

మునగాల : మండలంలోని ఆకుపాములలో నిరుపేద కుటుంబానికి చెందిన కొరిపెల్లి వెంకన్న అనారోగ్యానికి గురై మంచానికి పరిమితం అయ్యాడు. దీంతో వెంకన్న కుటుంబానికి ముకుందాపురానికి చెందిన పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రెండు నెలలకు సరిపడ బియ్యం, నిత్యావసర సరుకులను ఫౌండేషన్ చైర్మన్ పందిరి నాగిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ సలహాదారు ఎస్.ఎస్.రావు, సెక్రటరీ ఇమ్మడి సతీష్‌బాబు, ఎంపీటీసీ చింతల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పొంబర్తి వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు గోపి, వెంకట్రామయ్య, సభ్యులు, బాబు, అర్జున్, పాల్గొన్నారు.

ఆశా వర్కర్‌ను విధుల నుంచి తొలగించాలని వినతి



వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మునగాల : మండలంలోని ఈదులవాగు తండాలో ఆశా వర్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బోడ జీవితను విధుల నుంచి తొలగించాలని గురువారం గ్రామానికి చెందిన పలువురు రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల రోజులుగా ఆశా వర్కర్ గ్రామంలో అందుబాటులో లేరని, విధులకు గైర్హాజరు అవుతున్నారని ఆరోపించారు. దీంతో బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోడ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు బి.స్రై దమ్మ, పలువురు వార్డు సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

మునగాల : మండలంలోని యాకవారిక్క, చెరువారితండా తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ఎం. జానకిరాములు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటలకే కూలీలు పనులకు వచ్చి 11 గంటల వరకు ముగించుకోవాలన్నారు. వేసవితాపానికి గురికాకుండా జాగ్రత్త పడాలన్నారు. అవసరమైతే ఓఆర్ఎస్ పొట్లాలు తాగాలని సూచించారు. కూలీలకు తప్పనిసరిగా 100 రోజుల పని కల్పించాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోలాహలం లక్ష్మీనరసింహరావు, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణాచారి, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనంతగిరి : మండలంలోని అమీనాబాద్‌లో 11 కేవీ విద్యుత్ లైన్లకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున అమీనాబాద్ 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీధర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో రంజాన్ పర్వదినాన్ని గురువారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. -సాక్షి నెట్‌వర్క్



కోదాడ : సాలార్‌జంగ్‌పేట ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



నేరేడుచర్లలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మునగాలలో..



నడిగూడెంలో..



కోదాడ : ఈద్గా వద్ద ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న పలువురు నేతలు



పాలకీడు : రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎంపీపీ గోపాల్, జెడ్పీటీసీ మోతీలాల్, ముస్లింలు



చిలుకూరులో..



గరిడేపల్లిలో..



కోదాడరూరల్ : గుడిబండలో..



మఠంపల్లిలో..



మేళ్లచెరువులో..



హుజూర్‌నగర్‌లో..

చెరువు ఆక్రమణకు పాల్పడితే చర్యలు

కోదాడ : కోదాడ పెద్దచెరువులో మట్టిపోసి ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కోదాడ తహసీల్దార్ సాయిగౌడ్ హెచ్చరించారు. పట్టణ పరిధిలోని తెలుగు దేశం కార్యాలయం సమీపంలో కొందరు చెరువులో మట్టి పోసి ఆక్రమణకు పాల్పడుతున్నారని ఫిర్యాదు రావడంతో గురువారం ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. మట్టి పోసిన వారిని పిలిపించి వారి చేత ఆ మట్టిని జేసీబీ సాయంతో చెరువు లోతట్టు నుంచి తీసివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులో నీరు తక్కువగా ఉన్నందున ఆక్రమణకు పాల్పడకుండా నిత్యం నిఘా పెడతామని ఆయన చెప్పారు. అనంతరం కోదాడ పెద్ద చెరువు నీటిని తోల గించకుండా తూముకు మూసి వేయించారు. ఆయన వెంట మున్సిపల్, నీటి పారుదల, రెవెన్యూ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అక్రమంగా చేపలు పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

మోతె : మండల కేంద్రంలోని ముత్యాలమ్మ, తుమ్మల చెరువుల్లో అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా చేపలు పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని మత్స్య సొసైటీ అధ్యక్షుడు ఇండ్ల వెంకటేశ్వర్లు, సభ్యులు ఇండ్ల శ్రీకాంత్, ఇండ్ల వెంకటేశం కోరారు. గురువారం వారు స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 7న రాత్రి మోతె గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు చెరువులో చేపలు పట్టినట్లు ఆరోపించారు. అదేవిధంగా గురువారం ఉదయం కూడా దౌర్జన్యంగా చెరువులోకి దిగి చేపలు పట్టినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా చేపలు పడుతున్న వారిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికార పార్టీ అండతో కొందరు ముదిరాజ్‌లపై దాడులు చేయడానికి సైతం సిద్ధపడుతున్నారని అన్నారు. సంబంధిత మత్స్య శాఖ అధికారులు చొరవ చూపి చెరువుల్లో చేపలు పట్టకుండా చూడాలని, చేపలు పట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మోదీ నాయకత్వంలో ప్రగతి పథంలో దేశం

- నల్లగొండ బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు భాగ్యరెడ్డి

హుజూర్‌నగర్ : ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ప్రగతి పథంలో నడుస్తుందని బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో వారు పార్లమెంట్ ఎన్నికల ప్రచార వాహనాలను ప్రారంభించి మాట్లాడారు. దేశం బాగుండాలంటే మళ్లీ మోదీనే ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ గడ్డపై కాషాయం జెండా ఎగరడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కుటుంబ రాజకీయాలకు నల్లగొండ జిల్లా అడ్డగా మారిందని వారు విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఐంటి రవి, నియోజకవర్గ కన్వీనర్ అంబట్ల నరేష్, అధికార ప్రతినిధి పత్తిపాటి విజయ్, బాల వెంకటేశ్వర్లు, వీరబాబు, నరసాయ్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ ఎన్నికల ప్రచార వాహనాలను ప్రారంభిస్తున్న సైదిరెడ్డి, భాగ్యరెడ్డి

బీజేపీలో చేరికలు..

నేరేడుచర్ల మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వారికి ఆయన కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నాయకులు చింతకుంట సోమిరెడ్డి, జగతయ్య, పిన్నపురెడ్డి మల్లారెడ్డి, హిందూజా, పెద్ద సైదులు, కీత సోమయ్య తదితరులు ఉన్నారు.

నల్ల చట్టాల అమలును తిప్పికొట్టాలి



హుజూర్‌నగర్ : రైతు సంఘం జెండా ఎగురవేస్తున్న సీపీఎం నాయకుడు వెంకటేశ్వర్లు



మునగాల : జగన్నాథపురంలో..

హుజూర్‌నగర్ : దేశంలో వ్యవసాయ నల్ల చట్టాల అమలును తిప్పి కొట్టాలని సీపీఎం సీనియర్ నాయకుడు మాండ్ర వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు కంబాల శ్రీనివాస్, కొప్పోజు సూర్యనారాయణ అన్నారు. గురువారం అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని సీపీఎం కార్యాలయం వద్ద రైతు సంఘం జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర సమితి సభ్యుడు యల్లావుల రాములు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, నాయకులు గుండు వెంకటేశ్వర్లు, యల్లావుల రమేష్, జక్కుల రమేష్, మామిడి నరసయ్య, సత్యనారాయణ, కృష్ణ, వెంకన్న, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో..

మునగాల : మండలంలోని జగన్నాథపురంలో అఖిల భారత కిసాన్ సంఘ్ (ఏఐకేఎస్) 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం తెలంగాణ మహిళా రైతు సంఘం గ్రామ కమిటీ సభ్యురాలు షేక్ ఖాజాబీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ సైదా, గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు భూతం మోహన్‌బాబు, నెలారపు కొమురయ్య, సభ్యులు కొల్లు నాగేశ్వరరావు, నబీసాహెబ్, రాములు, శ్రీదేవి, మాధవరావు తదితరులు ఉన్నారు.

వెలిదండ గ్రామంలో..

గరిడేపల్లి : మండలంలోని వెలిదండ గ్రామంలో రైతు సంఘం 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి యానాల సోమయ్య రైతు సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు అమ్మిడి లక్ష్మణ, యానాల లక్ష్మణ, ఎలిమంచి, వీరయ్య, రాంబాబు, సుశీల, సత్యనారాయణ, శౌరి, కుస్సం, గోపి, సందీప్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


చిలుకూరులో..

చిలుకూరు : మండల కేంద్రంలో గురువారం రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొడ్డా వెంకటయ్య, నాయకులు పుట్టపాక అంజయ్య, బాలేబోయిన రవి, పిల్లుట్ల కృష్ణయ్య, యరగాని నాగయ్య, కొండా శేషయ్య, కొండా వెంకయ్య, బొడ్డు కాశయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి

గరిడేపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు జూలకంటి పోతుల కృష్ణతో పాటు పలువురు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి అంజన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పైడిమర్రి రంగనాథ్, బండ నర్సిరెడ్డి, రావుల రాములయ్య, హుస్సేన్, వెంకటరెడ్డి, సీతారామరెడ్డి, లక్ష్మారెడ్డి, కాశయ్య, సైదులు, అఖిల్, భాస్కర్, నాగయ్య, వెంకటరెడ్డి, నవీన్, జయరాజ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



కృష్ణను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న అంజన్‌రెడ్డి

మహాత్మా జ్యోతిరావ్ ఫూలేకు ఘన నివాళి

హుజూర్‌నగర్ : భారతదేశంలో తొలి సంఘ సంస్కర్త, ఉద్యమ నాయకుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే అని విద్యుత్ డీఈలు అమరబోయిన శ్రీనివాస్, వెంకటకృష్ణయ్య అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని విద్యుత్ డీఈ కార్యాలయంలో జ్యోతిరావ్ పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యుత్ 1104 యూనియన్ నాయకులు పోతురాజు రమేష్ బాబు, జగదీష్, వీరబాబు, కృష్ణయ్య, అంజయ్య, రమేష్, వెంకటాద్రి, శ్రీను, సత్యనారాయణ, శంకరాచారి, జనార్దనాచారి, షణ్ముఖాచారి, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావ్ పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి

భారత సామాజిక విప్లవోద్యమ నేత మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ మెంబర్ యరగాని నాగన్న, బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ కన్వీనర్ దూళిపాళ ధనుంజయ నాయుడు కోరారు. గురువారం పట్టణంలో వారు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు డి.శ్రీనివాస్, వి.గోవిందరావు, గుండెపు దేవ, అంజయాదవ్, ఆర్.వెంకటేశ్వర్లు, నరసింహాచారి, సాయి, శ్రీనివాస్, కృష్ణ, శేఖర్, లింగారావు, రవికుమార్, వెంకి, రాజశేఖర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

కోదాడ : విద్యార్థులు జ్యోతిరావ్ పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని అంబేద్కర్ ఆశయ సాధన కేంద్రం (అస్స్) సభ్యులు కోరారు. గురువారం కోదాడలోని ఎంఎస్ కళాశాలలోని అస్స్ ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్‌లో జ్యోతిరావ్ పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ పులి వెంకటేశ్వర్లు, బల్లుగి దుర్గయ్య, మాతంగి ప్రభాకర్, యలమర్తి శౌరి, గంధం బుచ్చారావు, రమేష్, వెంకటేశ్వర్లు, సండిపాటి సైదులు, పిడమర్తి వెంకటేశ్వర్లు, కరణ్, చేకూరి రమేష్, మాగి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వేపలసింగారంలో..

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో మహాత్మా జ్యోతిరావ్ పూలే 198వ జయంతి వేడుకలను డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ వినోద్



కోదాడ : జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఎస్ఐ, అస్స్ సభ్యులు

ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కలకంద జయరాజు, నందిగామ వెంకటేశ్వర్లు, జయరాజు, చిన్నప్ప, రంగయ్య, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

మునగాల : మండలంలో మహాత్మా జ్యోతిరావ్ పూలే 198వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్ పూలమాల వేసి నివాళులర్పించారు. రేపాలలో బీఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి పేరెల్లి బాబు ఆధ్వర్యంలో, నర్సింహాపురంలో సామాజిక ఉద్యమకారుడు డా.వేముల సత్యనారాయణ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు.

బడుగుల ఆశాజ్యోతి జ్యోతిరావ్ పూలే

నేరేడుచర్ల : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతిని గురువారం నేరేడుచర్లలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ధనుంజయనాయుడు, వెంకటేశ్వర్లు, నవీన్, నాగేశ్వరరావు, శ్రీను, రవి, అజయ్, సతీష్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్‌రావు, ఖాదర్, గోవిందోగౌడ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

మున్సిపాలిటీలోని రాంపురంలో గల జ్యోతిరావ్ పూలే బీసీ గురుకుల విద్యాలయంలో నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం జ్యోతిరావ్ పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్



హుజూర్‌నగర్ : పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న విద్యుత్ డీఈలు, ఉద్యోగులు

అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, గురుకుల ప్రిన్సిపాల్ వెంకటప్పయ్య, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ బట్టు మధు, రామస్వామి, సూర్యనారాయణరెడ్డి, క్రాంతికుమార్, విశ్వనాథ్, సురేష్, వెంకట్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో..

చిలుకూరు : మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో సంఘ సేవకుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, డీటీ కరుణశ్రీ, సీనియర్ అసిస్టెంట్ శైలజ, ఆర్ఐ సీతయ్య, వీరన్న, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

కోదాడరూరల్ : కోదాడలోని తహసీల్దార్ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావ్ పూలే 197వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి తహసీల్దార్ సాయిగౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీ చల్లా శ్రీనివాస్, సంధ్యారాణి, ఆర్ఐ రాజేష్, వెంకయ్య తదితరులు ఉన్నారు.

వేదాంత ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

నడిగూడెం : మండల పరిషత్ కార్యాలయం ఎదుట వేదాంత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐసిడ్డ వ్యవస్థాపకుడు మేకల వీరబాబు, ఎంపీటీసీ గుండు శ్రీనివాస్, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు యేసురాజు, పాతకొట్ల శ్రీను, వివిధ పార్టీల నాయకులు గద్దల మల్లేష్, బాణాల నాగరాజు, బెల్లంకొండ సత్యనారాయణ, శ్రీనివాస్, సుధీర్, గంగరాజు, శ్రీను పాల్గొన్నారు.



మునగాల : ఎంపీడీఓ కార్యాలయంలో..



చిలుకూరు : జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న తహసీల్దార్, సిబ్బంది



నేరేడుచర్లలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బాధితురాలికి న్యాయం జరిగేవరకు పోరాడుతాం

అనంతగిరి : మద్యం మత్తులో కొందరు యువకులు లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో బాధితురాలు మీసాల లలితమ్మకి న్యాయం జరిగే వరకు పోరాడుతామని ధర్మసమాజ్ పార్టీ నాయకుడు తలారి రాంబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలట్లకి కోసం మద్యం దుకాణంలో పని చేస్తున్న లలితమ్మపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 9వ తేదీన ఆమెపై దాడి చేయగా అనంతగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మసమాజ్ పార్టీ నాయకుడు తలారి రాంబాబు

నప్పటికీ పోలీసులు కేసు నమోదు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ధర్మసమాజ్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఒకటి, రెండు గుంటలకు నాలా అనుమతులు ఇవ్వం : ఆర్డీఓ

కోదాడ : ఒకటి, రెండు గుంటల భూములకు నాలా అనుమతులు ఇవ్వమని ఆర్డీఓ సీహెచ్. సూర్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మునగాల మండల కేంద్రంతో పాటు కోదాడ పరిసర గ్రామాల్లో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎటువంటి అనుమతులు లేకుండా లే అవుట్లు ఏర్పాటు చేసి ప్లాట్లను గుంటలుగా అమ్ముతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, అటువంటి వాటి రిజిస్ట్రేషన్లు చేయవద్దని మార్చి 13న కోదాడ సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. అనుమతులు లేని ప్లాట్లుగా విభజించిన సర్వే నంబర్లను త్వరలో గుర్తించి నిషేధిత జాబితాలో పెడతామని తెలిపారు.